


# విభారే
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్: అవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 14-05-2025 సంపుటి : 06 సంచిక : 365 పేజీలు : 8 వెల : రూ 3-00

# మన డ్రోన్లు, మిస్సైళ్ల గురించి ఆలోచిస్తే.. పాకిస్థాన్‌కు నిద్రపట్టదు: ప్రధాని మోదీ



అదంపూర్: అదంపూర్ ఎయిర్‌బేస్‌ను విజిట్ చేసిన ప్రధాని మోదీ అక్కడ జరిగిన కార్యక్రమంలో సైనికుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. భారత్ మాతా కీ జై అన్నది కేవలం నినాదం కాదు అని, దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసే సైనికుల ప్రతిజ్ఞ అని పేర్కొన్నారు. మన డ్రోన్లు, మిస్సైళ్లు శత్రు దేశాన్ని తాకినప్పుడు, వాళ్లకు భారత్ మాతా కీ జై వినబడుతుందన్నారు. అణ్వాయుధ దాడి చేస్తామని బెదిరింపులకు పాల్పడిన వాళ్లను మన సైనిక బలగాలు చుట్టేశాయని, అప్పుడు మన శత్రువులకు భారత మాతా కీ జై నినాద ప్రాముఖ్యత అర్థమైందన్నారు. మీరు చూపిన తెగువ, ధైర్యసాహసాలను అభినందించేందుకు ఇక్కడకు వచ్చినట్లు ప్రధాని మోదీ తెలిపారు. మీరు చూపిన ధైర్యాన్ని భవిష్యత్తులో చరిత్రగా చెబుకుంటారన్నారు. మన ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌కు సెల్యూట్ చేస్తున్నట్లు చెప్పారు. మనం ప్రదర్శించిన సాహసం వల్లే.. ప్రపంచ దేశాలకు ఆపరేషన్ సింధూర్ సక్సెస్ వినిపించిందన్నారు.మనది గౌతమ బుద్ధుడు, గురు గోబింద్ సింగ్ పుట్టిన పుణ్యదేశమని, మన శత్రువులు మన సైనిక బలగాలను మరిచి మనల్ని సవాల్ చేశారన్నారు. భారత్‌పై కన్ను వేస్తే నాశనం తప్పదని.. ఉగ్రవాదానికి ఊతం ఇచ్చే దేశాలు గ్రహించాయన్నారు. పాకిస్థాన్ ఆర్మీని మన త్రివిధ దళాలు చావు దెబ్బతీశాయని, శత్రు దేశానికి దాని స్థానాన్ని చూపించాయన్నారు. మన డ్రోన్లు, మిస్సైళు చేసిన ఆపరేషన్‌ను చూసి.. పాకిస్థాన్‌కు చాలా కాలం నిద్ర పట్టదన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో మనం మన ఆత్మవిశ్వాసాన్ని పెంచుకున్నామన్నారు. ప్రజల్లో ఐకమత్యం పెరిగిందన్నారు. పాకిస్థాన్ లోపల ఉన్న ఉగ్రవాద కేంద్రాలను ఐఏఎఫ్ టార్గెట్ చేసిందని, చాలా వేగంగా, కచ్చితత్వంతో ఆ దాడి జరిగిందని, శత్ర దేశం ఆ దాడితో స్టన్ అయ్యిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.పాకిస్థాన్ విషయంలో మన లక్ష్మణ రేఖ క్లియర్‌గా ఉందని, ప్రతి ఉగ్రవాద దాడికి.. బలమైన రీతిలో రిప్లై ఉంటుందన్నారు. ఉగ్రవాదానికి అండగా ఉన్న గాడ్‌ఫాదర్ దేశాలను, స్పాన్సర్ దేశాలను వేరుగా చూడబోమన్నారు. ఆపరేషన్ సింధూర్‌లోని ప్రతి సందర్భం మన సైనిక బలగాల శక్తికి నిదర్శనమన్నారు. మన త్రివిధ దళాల ఆధిపత్యాన్ని చాటుతుందన్నారు. పాకిస్థాన్ మనపై దాడి చేసేందుకు తీవ్ర ప్రయత్నం చేసిందని, కానీ మన ఎయిర్‌బేస్‌లు, డిఫెన్స్ మౌళిక సదుపాయాలకు ఎటువంటి నష్టం జరగలేదని ప్రధాని తెలిపారు.ఆర్మీ, నేవీ, వైమానిక దళం మధ్య ఉన్న కోఆర్డినేషన్‌ను ప్రధాని మోదీ విశేషంగా మెచ్చుకున్నారు. త్రివిధ దళాలు మధ్య పర్ఫెక్ట్ కోఆర్డినేషన్ ఉందన్నారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో మెషీన్ శక్తిని ప్రదర్శించినట్లు మోదీ తెలిపారు. గత దశాబ్ధ కాలంలో ప్రపంచంలోనే అత్యుత్తమైన ఆయుధ పరికరాలను సమకూర్చుకున్నామని, టెక్నాలజీతో పాటు వ్యూహాలను కలిపి మన సామర్థ్యాన్ని ప్రదర్శించినట్లు చెప్పారు. కేవలం ఆయుధాలతో దాడి చేయబోలేమని, డ్రోన్లు.. డేటాతో కూడా దాడులు చేయనున్నట్లు మోదీ వెల్లడించారు.అన్ని సమయాల్లో మనం అప్రమత్తంగా ఉండాలని, కొత్త తరహా భారత్‌తో డీల్ చేస్తున్నామన్న విషయం మన శత్రువుకు తెలిసి ఉండాలన్నారు. భారత్ ఎప్పుడూ శాంతి వైపే ఉంటుందని, ఒకవేళ శత్రువు దాడి చేస్తే, అప్పుడు ప్రతిదాడికి వెనుకాడబోమన్నారు.




అమరావతి మే 13 :మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఊరట దక్కింది. టీడీపీ కార్యకర్త సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో అరెస్టయిన అతడికి ఎస్సీ, ఎస్టీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో 90 రోజులకు పైగా జైల్లో ఉన్న వంశీ.. ఎస్సీ ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో మూడోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవల ఇరు వర్గాల తరపు న్యాయవాదుల వాదనలు విన్న కోర్టు నేడు డిఫెన్స్ వాదనలతో ఏకీభవిస్తూ వంశీకి బెయిల్ మంజూరు చేసింది. వంశీ తోపాటు మరో నలుగురికి కూడా బెయిల్ మంజూరు చేసింది. 2023లో గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసును నీరు కార్చేందుకు వైసీపీ నేత వల్లభనేని వంశీ పన్నిన పథకం తిరిగి ఆయన మెడకే చిక్కుకుంది. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదు వాపస్ తీసుకునేలా తన సోదరుడు ముదునూరి సత్యవర్ధన్‌ను బెదిరించి, భయపెట్టారని... కిడ్నాప్ కూడా చేశారని కిరణ్ అనే యువకుడు పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వల్లభనేని వంశీని ప్రధాన నిందితుడిగా పేర్కొని హైదరాబాద్‌లో అతడిని అరెస్ట్ చేశారు.గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసును నీరుగార్చే ఉద్దేశంతోనే వల్లభనేని వంశీ, అతడి అనుచరులు సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేయడంతోపాటు దాడి చేశారని పోలీసు దర్యాప్తులో తేలింది. తనకు అనారోగ్యంగా ఉందని రెండు సార్లు బెయిల్ మంజూరు కోరుతూ ఎస్సీ ఎస్టీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, రెండు పిటిషన్లు తిరస్కరించిన న్యాయస్థానం మూడోసారి బెయిల్ పిటిషన్‌ను అంగీకరించింది. తనకు అనారోగ్యంగా ఉందని, ఊపిరి తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందిగా ఉందని కోర్టుకు వల్లభనేని వంశీ వివరించడంతో డిఫెన్స్ వాదనలను ఏకీభవిస్తూ బెయిల్ మంజూరు చేసింది.

# నేడు పదవీ విరమణ చేయనున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా..

మే 13 )భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా నేడు పదవీ విరమణ చేయనున్నారు. డీవై చంద్రచూడ్ పదవీ విరమణతో ప్రస్తుత సీజేఐ సంజీవ్ ఖన్నా 2024 నవంబర్‌లో ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆరు నెలలు మాత్రమే సేవలందించారు. నేటితో ఆయన పదవీ కాలం ముగిసింది. దీంతో భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ రేపు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

జస్టిస్ సంజీవ్ ఖన్నా.. న్యూఢిల్లీలో 1960, మే 14న జన్మించారు. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయశాస్త్రాన్ని చదివారు. ఢిల్లీ హైకోర్టులో 2005లో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2006లో శాశ్వత జడ్జి అయ్యారు. 2019, జనవరి 18న సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టు జడ్జిగా ఆయన పలు ప్రముఖ తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)ల వినియోగాన్ని ఆయన సమర్థిస్తూ.. అవి పూర్తి భద్రమైనవని, దాని వల్ల బోగస్ ఓట్లు, బూత్‌ల రిగ్గింగ్‌ను అరికట్టవచ్చునని పేర్కొన్నారు. అలాగే ఎలక్టోరల్ బాండ్లపై సంచలన తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో ఖన్నా కూడా ఉన్నారు. 370 అధికరణ రద్దును సమర్థిస్తూ తీర్పు ఇచ్చిన ధర్మాసనంలో కూడా ఆయన సభ్యుడే.

## నూతన సీజేఐగా జస్టిస్ గవాయ్



**తదుపరి సీజేఐగా జస్టిస్ గవాయ్.. :** కాగా తదుపరి సీజేఐగా జస్టిస్ గవాయ్ పేరును సీజేఐ ఖన్నా ఏప్రిల్ 16న కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. 2019 మే 24న సుప్రీంకోర్టుకు పదోన్నతిపై వచ్చిన జస్టిస్ గవాయ్ సీజేఐగా ఆరు నెలలకుపైగా కొనసాగుతారు. 2025 నవంబర్ 23న ఆయన పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న రెండో దళిత న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ కావడం విశేషం.

**పలు కీలక తీర్పులు..:** గవాయ్ పూర్తిపేరు భూషణ్ రామకృష్ణ గవాయ్. 1960 నవంబర్ 24న మహారాష్ట్రలోని అమ్రావతిలో జన్మించిన జస్టిస్ గవాయ్.. 1985 మార్చి 16న బార్‌లో సభ్యుడిగా చేరారు. 2003 నవంబర్ 14న బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2005 నవంబర్ 12న అదే హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనేక చరిత్రాత్మక తీర్పులను వెలువరించిన సుప్రీంకోర్టుకు చెందిన పలు రాజ్యాంగ ధర్మాసనాలలో జస్టిస్ గవా య్ కూడా ఉన్నారు. పూర్వ జమ్మూ కశ్మీరు రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని 370 అధికరణను రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఏకగ్రీవంగా సమర్థించిన ఐదుగురు న్యాయమూ ర్తుల రాజ్యాంగ ధర్మాస నంలో జస్టిస్ గవాయ్ కూడా ఉన్నారు. రాజకీయ పార్టీలకు నిధులను సమకూర్చే ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన మరో ఐదుగురు న్యాయ మూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో కూడా జస్టిస్ గవాయ్ సభ్యుడిగా ఉన్నారు.రూ. 1000, రూ. 500 నోట్లను రద్దు చేస్తూ కేంద్రం 2016లో తీసుకున్న నిర్ణయాన్ని 4:1 మెజారి టీతో ఆమో దించిన మరో ఐదుగురు న్యాయమూ ర్తుల రాజ్యాంగ ధర్మాస నంలో కూడా జస్టిస్ గవాయ్ పాత్ర ఉంది.

# వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలి

**2 లక్షల ఎకరాల భూములు సాగులోకి తెచ్చేందుకు రైతులను ప్రోత్సహించండి:జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**

నంద్యాల మే 13 :-డ్రోన్ టెక్నాలజీతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో వ్యవసాయంలో కిసాన్ డ్రోన్స్ వినియోగంపై గ్రూప్ కన్వీనర్, కో-కన్వీనర్, అధికారులు, ఎఫ్పిఓలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఎల్డిఎం రవీందర్ కుమార్, ఆర్ఆర్ఎస్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.రామకృష్ణా రావు, నాబార్డు డిడిఎం, డ్రోన్ నిర్వాహకులు చైతన్య, రైతులు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ కిసాన్ డ్రోన్స్ సాంకేతికత వినియోగం ద్వారా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుక రావడంతో పాటు రైతులకు మెరుగైన ఉపాధి అవకాశాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. రైతు గ్రూపులకు కూడా డ్రోన్స్ ఇవ్వడం జరిగిందని జిల్లాలో ఇప్పటి వరకు 40 డ్రోన్స్ వరకు వినియోగించడం జరుగుతోందన్నారు. రానున్న రోజుల్లో ఇంకా అధునాత సాంకేతికత రావడం జరుగుతుందని వాటిని రైతులు అందిపుచ్చుకోవాలన్నారు. డ్రోగో కృషి 3ప్రో అనే డ్రోన్ సుమారు 9.8 లక్షల వరకు ఖర్చు అవుతుందని అందులో 80 శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని, ఈ డ్రోన్ లో ఆటోమేటిక్, మాన్యువల్ పద్ధతి ద్వారా వినియోగించే అవకాశం ఉంటుందన్నారు. ఈ ఆటోమేటిక్ విధానం ద్వారా రైతుల దగ్గర ఉన్న ఎఫ్ఎంబి కాపీలో ఉన్న రేఖాంశం, అక్షాంశల వివరాలను డ్రోన్ లో నమోదు చేస్తే మనిషి అవసరం లేకుండా పొలం మొత్తం స్ప్రే చేసే అవకాశం ఉంటుందని, అదే విధంగా మాన్యువల్ పద్ధతిలో రిమోట్ కంట్రోల్ ద్వారా పొలం గట్ట మీద నిలబడి కూడా ఆపరేట్ చేసే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ డ్రోన్ లో ఉన్న సెన్సార్ ద్వారా గట్టు ఎత్తుల పల్లలాలు, విద్యుత్ తీగలు గుర్తించి స్ప్రే చేసే అవకాశం ఉంటుందన్నారు. ఇందులో 5 సెట్ల పునర్వినియోగించే బ్యాటరీలు ఉంటాయని 1 సెట్టు బ్యాటరీ ద్వారా నాలుగు ఎకరాలు, మొత్తం 5 సెట్టు బ్యాటరీల ద్వారా 20 ఎకరాల వరకు స్ప్రే చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ బ్యాటరీలు రీచార్జ్ చేయడానికి 45 ని.ల సమయం పట్టే అవకాశం ఉందన్నారు. నానో యూరియా వినియోగం ద్వారా పెట్టుబడి తగ్గి దిగుబడి పెరగడం వల్ల డ్రోన్స్ వినియోగం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. పొలాల్లో మోతాదుకు మించి రసాయనాలు వాడటం ద్వారా మైక్రో న్యూట్రియెంట్స్ తగ్గి భూమి నిస్సారవంతం అవుతుందన్నారు. భూమిలో కార్బన్ కంటెంట్ 3% కంటే తక్కువగా ఉందని... భూమి సారాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పంటలకు అవసరం వున్నా, లేకున్నా తడి ఇవ్వడం ద్వారా సూక్ష్మ పోషకాలు తగ్గి పంట దిగుబడి తగ్గుతోందని... వీటి నివారణ కోసం డ్రోన్స్ సరైన పరిష్కారమన్నారు. జిల్లాలో సుమారుగు 2 లక్షల ఎకరాల వరకు ఒకే పంట వేసి పంట పొలాలను బీడు భూములుగా వుంచకుండా వాటిలో వ్యవసాయ, ఉద్యానవన పంటలైన నువ్వులు, బ్లాక్ గ్రామ్, సోయా, కొర్ర తదితర పంటలు వేసేలా రైతులను ప్రోత్సాహించాలన్నారు.డ్రోన్స్ కు పొలాల దగ్గర ఛార్జింగ్ పెట్టుకునే అవకాశంతో పాటు డ్రోన్స్ ట్యాంకు సామర్థ్యాన్ని పెంచేలా చూడాలని డ్రోగో నిర్వాహకులను కలెక్టర్ కోరారు.




# భూ సేకరణ కేసులను త్వరితగతిన పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలిజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



విభారే న్యూస్‌కర్నూలు,ప్రతినిధి మే 13:- భూ సేకరణ కేసులను త్వరితగతిన పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో భూ సేకరణ కేసుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు...ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కర్నూలు, ఆదోని, పత్తికొండ డివిజన్లకు సంబంధించి మండలాల వారీగా భూసేకరణ కేసుల గురించి సమీక్షించారు..ఏ మండలంలో ఎన్ని భూసేకరణ సమస్యలు ఉన్నాయి, ఎంత డబ్బు చెల్లించాల్సి ఉంది, అందుకు సంబంధించి తీసుకున్న చర్యల గురించి కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓ లను అడిగి తెలుసుకున్నారు...భూసేకరణ కు సంబంధించి కోర్టు కేసులపై వెంటనే స్పందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..పరిహారం చెల్లింపునకు సంబంధించి అవసరమైన నిధుల కేటాయింపు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని,ఈ అంశంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ జాయింట్ కలెక్టర్ కి సూచించారు.. శాఖల వారీగా ఏ ఏ కేసులు ఉన్నాయి, ఎంత డబ్బు చెల్లించాలి అన్న వివరాలతో నివేదిక ను సిద్ధం చేయాలని కలెక్టర్ డిఆర్వో ను ఆదేశించారు....ఈ నివేదికను సంబంధిత శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ లు, సిసిఎల్ఏ, జీపీ, ఏజిపి లకు పంపాలని కలెక్టర్ ఆదేశించారు..భూ సేకరణ కేసులకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితిని సంబంధిత ఆర్డీఓ లకు పంపించాలని కలెక్టర్ భూ సేకరణ సెక్షన్ అధికారులను ఆదేశించారు..సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు వెంకటేశ్వర్లు, అనూరాధ, అజయ్ కుమార్, జిపి , ఏజిపి లు తదితరులు పాల్గొన్నారు..

# సంపాదకీయం

బుధవారం 14-05-2025

## పాకిస్తాన్ ఉగ్రముద్రను దాచేందుకు అగుచాట్లు

పాకిస్తాన్ తన దేశంలో పెరుగుతున్న ఉగ్రవాదాన్ని దాచడానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తోంది. కానీ, ఎంత దాచాలని ప్రయత్నిస్తున్నా.. ప్రపంచానికి దాని నిజ స్వరూపం తెలుస్తూనే ఉంది. పాకిస్థాన్ ప్రభుత్వం, పాకిస్థాన్ సైన్యం అమాయక మతాధికారిగా చిత్రీకరించడానికి ప్రయత్నిస్తున్న ఉగ్రవాది, ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా ప్రధాన నాయకుడు, సహాయక చర్యల ముసుగులో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నాడు. అతని పేరు హాఫీజ్ అబ్దుల్ రవూఫ్. గత కొన్ని రోజులుగా వైరల్ అవుతున్న ఓ ఫొటోలో ఉన్న వ్యక్తి ఉగ్రవాది కాదని, మత నాయకుడు అని పాకిస్తాన్ ఆర్మీ ప్రతినిధి విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ వ్యక్తి కొంతమంది పాకిస్తాన్ సైనికులతో పాటు అంత్యక్రియల ఊరేగింపులో కనిపించాడు. ఆ వ్యక్తి తన ఐడి కార్డు కూడా చూపించి తాను ఒక సాధారణ రాజకీయ కార్యకర్తనని చెప్పాడు. పాకిస్తాన్ సైన్యం ఇచ్చిన ఆ వ్యక్తి సమాచారం.. అంటే పేరు, పుట్టిన తేదీ, జాతీయ గుర్తింపు సంఖ్య కూడా అమెరికాచే ప్రత్యేకంగా నియమించబడిన గ్లోబల్ టెర్రరిస్ట్‌గా ప్రకటించబడిన వ్యక్తితో పూర్తిగా సరిపోలుతున్నట్లు తేలింది. అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ప్రకారం.. హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ లష్కరే తోయిబా, దాని ఫ్రంట్ సంస్థల కోసం విరాళాలు సేకరిస్తున్నాడు. పాకిస్తాన్ ఆర్మీ ప్రతినిధి చూపించిన ఐడి కార్డులో అతను "వెల్ఫేర్ వింగ్ ఇన్‌చార్జ్, పీఎంఎంఎల్" అని ఉంది, అంటే అతను తన కార్యకలాపాలను దాచడానికి ఒక రాజకీయ లేదా మతపరమైన సంస్థ పేరును ఉపయోగిస్తున్నాడు. పాకిస్తాన్ సైన్యం మత ప్రచారకుడిగా అభివర్ణించిన వ్యక్తి నిజానికి ఒక అంతర్జాతీయ ఉగ్రవాది. దీన్ని బట్టి పాకిస్తాన్ ఉద్దేశపూర్వకంగా ఉగ్రవాదులకు రక్షణ కల్పిస్తోందని, ప్రపంచాన్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తోందని స్పష్టమవుతోందియూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ప్రకారం.. ఉగ్రవాది హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ ఫేస్ ఆఫ్ ది లష్కరే తోయిబాగా ఉన్నాడు. లష్కరే తోయిబా అగ్ర నాయకత్వ బృందంలో చేరిన హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ 1999 నుండి ఆ సంస్థ కోసం పనిచేస్తున్నాడు. రవూఫ్ లష్కరే ఫ్రంట్ సంస్థ ఫలాహ్-ఎ-ఇన్సానియత్ ఫౌండేషన్ అధిపతి, ఇది సహాయ చర్యల ముసుగులో ఉగ్రవాద కార్యకలాపాల కోసం నిధులు సేకరిస్తుంది. 2008 ముంబై దాడుల తర్వాత లష్కరేపై అంతర్జాతీయంగా ఒత్తిడి పెరిగినప్పుడు, రవూఫ్ ఎఫ్ఐఎఫ్ పేరుతో పాకిస్తాన్‌లో నిధుల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించాడు. 2009లో ఈ కార్యక్రమం నుండి భారీ మొత్తంలో నిధులు సేకరించినట్లు సమాచారం. లష్కరే తోయిబా, జమాత్-ఉద్-దవా అధిపతి హాఫీజ్ మొహమ్మద్ సయీద్ సూచనల మేరకు రవూఫ్ నేరుగా పనిచేస్తాడు. 2008లో రవూఫ్ లష్కర్ మానవతా సహాయ డైరెక్టర్‌గా నియమితులయ్యాడు. 2003లో పబ్లిక్ సర్వీస్ డైరెక్టర్‌గా ఉన్నాడు. ఆగస్టు 2008లో హాఫీజ్ సయీద్ ఆదేశం మేరకు,పాకిస్తాన్‌లోని బజౌర్ ప్రాంతంలో సహాయ, నిధుల సేకరణ కార్యకలాపాలను సమీక్షించడానికి రవూఫ్ ఒక బృందానికి నాయకత్వం వహించాడు. ఇది మాత్రమే కాదు, రవూఫ్ లష్కర్ ప్రతినిధిగా కూడా ఉన్నాడు. ఆయన సంస్థ తరపున మీడియాలో, వెబ్‌సైట్‌లలో, ప్రజా వేదికలలో మాట్లాడుతున్నాడు. ఎఫ్ఐఎఫ్ ద్వారా అతను లష్కర్ కు ప్రజల మద్దతు, నిధులను సేకరించడానికి హై-ప్రొఫైల్ మీడియా ఈవెంట్లను నిర్వహిస్తాడు. డిసెంబర్ 2008లో లష్కర్ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసిన ఇంటర్వ్యూలో రవూఫ్ లష్కర్, జమాత్-ఉద్-దవా సంక్షేమ కార్యకలాపాల గురించి బహిరంగంగా మాట్లాడాడు, దానిని తన సంస్థ అని పేర్కొన్నాడు.హాఫీజ్ రవూఫ్ లష్కర్ స్వచ్ఛంద విభాగం "ఇదారా-ఎ-ఖిద్మత్-ఎ-ఖల్క్" కి కూడా నాయకత్వం వహించాడు. 2007లో అతను పెషావర్‌కు వెళ్లి, వరద బాధితుల సహాయ చర్యలను పర్యవేక్షించాడు. మే 2004లో జమాత్-ఉద్-దవా సంక్షేమ అధిపతిగా అతను ఒక వైద్య సంస్థ వార్షిక నివేదికను కూడా సమర్పించాడు. లను 2006 ఏప్రిల్‌లో ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు సంస్థలుగా అమెరికా గుర్తించింది. హాఫీజ్ సయీద్‌ను మే 2008లో ప్రత్యేకంగా నియమించబడిన గ్లోబల్ టెర్రరిస్ట గా ప్రకటించారు. 2008 డిసెంబర్ లో జమాత్-ఉద్-దవాను ఐరా 1267 ఆంక్షల జాబితాలో ఉంచారు. హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ పై వచ్చిన ఆరోపణలు, ఉగ్రవాద సంస్థలు సేవ పేరుతో ఎలా భయాన్ని వ్యాప్తి చేస్తాయో మరోసారి నిరూపిస్తున్నాయి. మరో వైపు ఓవైపు భారత్ కొట్టే దెబ్బకు పాక్ బలగాలకు దిమ్మ తిరుగుతోంది. మరోవైపు బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఏ) చేసే దాడులను సైతం పాక్ ఆర్మీ తిప్పికొట్టలేక తల పట్టుకుంటోంది. కాల్పుల విరమణ ప్రకటనతో పాక్ మోసం చేస్తుందని, పాక్ ఆర్మీ ట్రాప్‌లో పడొద్దని బలూచ్ లిబరేషన్ ఆర్మీ భారత ప్రభుత్వానికి సూచించింది.బలూచ్ లిబరేషన్ ఆర్మీ 51 కంటే ఎక్కువ ప్రదేశాలలో 71 దాడులు చేసి పాక్ బలగాలను ముప్పుతిప్పలు పెట్టింది. బలూచ్ గ్రూప్ పేరు చెబితే పాక్ బలగాలు వణికిపోతున్నాయి. పాక్ ఆర్మీ మీద గత కొన్నిరోజులుగా బలూచ్ ఆర్మీ దాడులు చేసి కొన్ని ప్రాంతాలు స్వాధీనం చేసుకుంది. ఆ ప్రాంతాలను బలూచిస్తాన్ ఆక్రమిత ప్రాంతంగా చెబుతున్నారు. దేశంలో పెను మార్పులు రానున్నాయని బిఎల్ఏ ఒక ప్రకటనలో తెలిపింది. భారత్ తమతో చేతులు కలిపినా, లేక తమకు మద్దతుగా నిలిస్తే తాము పాకిస్తాన్ ఆర్మీ భరతం పడతామని బలూచ్ ఆర్మీ కోరింది.బిఎల్ఏ గ్రూప్ విదేశీ టీమ్ అనే ఆరోపణలను ఖండించారు. తమది దేవంలోని నిర్ణయాత్మక పక్షమని పేర్కొంది. బలూచ్ ఆర్మీ ఇటీవల చేసిన దాడులలో పాకిస్తాన్ ఆర్మీ కాన్వాయ్‌లు, సీక్రెట్ మీటింగ్ కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇస్లామాబాద్ ప్రాంతాన్ని తమ కంట్రోల్ లోకి తెచ్చుకునేందుకు బలూచ్ గ్రూప్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి ఉగ్రసంస్థలను పాక్ పెంచి పోషిస్తోంది. అందువల్ల సరిహద్దు దేశాల్లో ఉగ్రదాడులు పెరుగుతున్నాయి. వీటికి పాక్ సైన్యం బాధ్యత వహించాలి.

# మద్యం వ్యాపారుల నయా దందా...

**ఇష్టరాజ్యంగా వైన్స్ షాప్ ల నిర్వహణ**
**సమయ పాలనకు మంగళం**
**బెల్టుషాపులే ఫుల్లు.. వాటి కోసమే వైన్ షాప్ లు...**
**అడ్డుగోలుగా మద్యం విక్రయాలు**
**ధనార్జనే ధ్యేయంగా దండుకుంటున్న వ్యాపారులు**
**మామూలు'గా తీసుకుంటున్న అధికారులు**
**తనిఖీలను మరచిన ఎక్సైజ్ అధికారులు**
**వారి కనుసన్నలోనే మద్యం విక్రయాలు**
**సామాజిక సేవకులు కర్నే బాబురావు**

భద్రాద్రి కొత్తగూడెం మే 13, ) ,మణుగూరు మండలంలో బెల్టుషాపులకు అడ్డుగోలుగా మద్యం విక్రయస్తూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ వైన్‌షాప్ యజమానులు కొత్తరకం దందాకు తెరలేపారని సామాజిక సేవకులు కర్నె బాబురావు ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియా కు ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం నుండి మద్యం దుకాణాలను టెండర్ ద్వారా పొందిన మద్యం వ్యాపారులు వైన్ షాప్ లను సమయానుసరం తెరచి ఉంచకుండా కేవలం సాయంత్రం సమయంలో తెరిచి బెల్ట్‌షాప్‌ల ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధన మేరకు ప్రతి వైన్ షాప్ ఉదయం 10 నుండి సాయంత్రం 10 గంటల వరకు మద్యం విక్రయాలు జరపాలికానీ ఇవేమీ తమకు పట్టినట్టు వైన్ షాప్ నిర్వాహకులు షాపులకు వచ్చిన మద్యం నిల్వలను సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా కేవలం బెల్టు షాపులకు మాత్రమే పరిమితం చేస్తూజేబులు నింపుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వినియోగదారునికి అందుబాటు లో ఉండవలసిన సమయంలో సైతం నిర్వాహకులు వైన్ షాపులకు తాళం వేసి ఉంచడంతో వైన్స్ కొనుగోలు చేయడానికి వచ్చిన వారందరూ తిరిగి బెల్టుషాపుల వైపు వెళ్తున్నారని ప్రత్యక్షంగా వైన్ షాప్ నిర్వాహకులే బెల్టు షాపులనుప్రోత్సహిస్తున్నారని తెలిపారు.ఒకవేళ వైన్ షాప్ తెరిచి ఉన్నా ప్రముఖ కంపెనీలకు చెందిన బీర్లు స్టాక్ లేదంటూ నిర్వాహకులు సమాధానం ఇస్తున్నారని, వైన్‌షాప్‌లో అమ్మ వలసిన బీర్లు అక్కడ దొరకకపోవడమే కాకుండా ఎక్కువ రేటుకు బెల్ట్ షాపుల్లో లభించడంతో చేసేదేమీలేక అధిక ధరలకు బెల్ట్‌షాప్‌లో మద్యం కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు.సమయపలన పాటించని వైన్ షాపులపై తనిఖీలు నిర్వహించకుండా ఎక్సైజ్ అధికారులు శోధ్యం చూస్తున్నారని ధ్వజమేత్తరు.ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు అమ్ముతూ అందినకాడికి దండుకుంనెందుకు పోటీపడి వైన్‌షాపులను దక్కించుకున్న వ్యాపారులు దానిని తిరిగి రాబట్టుకునేందుకు ఇష్టరాజ్యంగా వైన్స్ షాప్ లను నిర్వహిస్తున్నారనీ, క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ లేకపోవడమే మద్యం వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నదన్నారు.మండలంలో వందల సంఖ్యలో బెల్ట్‌షాపులు ఉన్నాయంటే వారి అక్రమ మద్యం వ్యాపారాన్ని ఏరీతిలో సాగిస్తున్నారో అర్థమవుతుందన్నారు. ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం తోనే అడ్డుగోలుగా మద్యం విక్రయాలుజరుపుతూ ధనార్జనే ధ్యేయంగా వ్యాపారులు దండుకుంటున్నారని బాబురావు విమర్శించారు.అన్ని ప్రభుత్వ శాఖల్లో ఒకటిగా ఉన్న ఎక్సైజ్ శాఖ పినపాక నియోజకవర్గం లో అసలు పనిచేస్తుందా లేదా అన్న అనుమానాలకు దారి తీసేలా వారి పనితీరు ఉందన్నారు.బెల్ట్,వైన్స్ షాపుల్లో నిర్భయంగా అధిక ధరలతో లిక్కర్ అమ్మకాలు సాగిస్తుంటే ఎక్సైజ్ అధికారుల యంత్రాంగం మాత్రం చూసి చూడనట్లు వ్యవహరించడం ఏమిటని, వారి మౌనం దేనికి సంకేతం అని ప్రశ్నించారు.నియోజకవర్గం వ్యాప్తంగా మద్యం దందా జోరుగా సాగుతున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ విజిలెన్స్ అధికారులకు మాత్రం కానరాకపోవడం అనుమా నాలకు తావిస్తుందన్నారు. కనీసం అధికారులు మద్యం దందా కట్టడిని మరిచారని, లిక్కర్ అక్రమ దందాను అరికట్టాల్సిన విజిలెన్స్ అధికారులు పట్టించుకోవ డం లేదన్న విషయం స్పష్టమవుతోం దన్నారు. జిల్లా స్థాయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక దాడులకు దిగకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఊరూరా బెల్ట్‌షాపులు కొనసాగుతు న్నా పట్టించుకోవడం లేదని, గుడుంబా తయారీ దారుల నునియంత్రిం చేందుకంటూ కాలం పొద్దుపుచ్చే విధులు, విధానాలు అనేఎక్సైజ్ అధికారులు మద్యం దందా ను కూడ నియంత్రించాలని ఆయన కోరారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు మండలంలోజరుగుతున్న మద్యం నయా దందాపై దృష్టి పెట్టి, మద్యం దందా ను కట్టడి చేసే విధంగా చర్యలు చేపట్టాలని, వైన్ షాపులు సమయ పాలన పాటించే విధంగా చర్యలు చేపట్టాల ని ఆయన డిమాండ్ చేశారు.లేనిచో ఈ అక్రమ మద్యం విక్రయాలు, సమయ పాలన పాటించని వైన్ షాపులపై ఎక్సైజ్ శాఖ ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

## నరం ఇన్ఫెక్షన్ తో భాదపడుతున్న పేషెంట్ కు రక్తదానం చేసి ఆదుకున్న న్యాయవాది బేతి మహేందర్ రెడ్డి.

**ఓ నెగటివ్ రక్తాన్ని 66 సార్లు దానం చేసిన బేతి మహేందర్ రెడ్డి. రక్తదానం ఒక ప్రాణాన్నే కాదు కుటుంబాన్ని రక్షిస్తుంది.రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి.బీజేపీ నేత, రక్తదాత బేతి మహేందర్ రెడ్డి పిలుపు.**

కరీంనగర్ మే 13, )ప్రమాదకర పరిస్థితిల్లో అత్యంత అరుదైన "ఓ నెగటివ్" రక్తాన్ని గత 31 ఏళ్లుగా దానం చేస్తున్నానని, ఎంతోమంది రోగుల ప్రాణాలు కాపాడడంతో పాటు నేటివరకు 66 సార్లు రక్తదానం చేయడం జరిగిందని బీజేపీ నేత, న్యాయవాది బేతి మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మోహన్ రావు పేట గ్రామానికి చెందిన చింగనవేని గంగన్న (55 ఏళ్లు) అనే వ్యక్తి కరీంనగర్ లోని ఒక ప్రైవేట్ దవాఖానలో తీవ్రమైన నరం ఇన్ఫెక్షన్ తో చికిత్స పొందుతున్న వ్యక్తికి అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని డాక్టర్స్ సూచించడంతో పేషెంట్ కు ఓ నెగటివ్ రక్తం అత్యవసరం కాగా నగరంలోని ఒక ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్ లో పేషెంట్ బంధువులు సంప్రదించగా బ్లడ్ బ్యాంకు నిర్వాహకులు బేతి మహేందర్ రెడ్డి కు ఫోన్ ద్వారా సమాచారం అందిచగా వెంటనే వెళ్లి ఓ నెగటివ్ రక్తం దానం చేసి ప్రాణాలు కాపాడడం జరిగిందని మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ రక్తదానం చేయడం ద్వారా నేటివరకు 66 సార్లు ఓ నెగటివ్ రక్తం దానం చేయడం జరిగిందని బేతి మహేందర్ రెడ్డి తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా రోగి ప్రాణాలు కాపాడడంతో పాటు వారి కుటుంబాన్ని కూడా రక్షించినవారమవుతామని, అలాగే రక్తదానం చేయడం ద్వారా మనకు కొత్త రక్తం రావడమే కాకుండా ఆరోగ్యాంగా ఉంటామని, అందుకే ఎలాంటి భయాలు లేకుండా ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఈ సందర్భంగా బేతి మహేందర్ రెడ్డి కోరారు. రక్తదానం చేసిన బేతి మహేందర్ రెడ్డిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఫోన్ ద్వారా అభినందించగా, అలాగే బీజేపీ శ్రేణులు, న్యాయవాదులు, 40వ డివిజన్ వాస్తవ్యులు, శ్రేయోభిలాషులు అభినందించారని బేతి మహేందర్ రెడ్డి తెలిపారు.

## విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను సక్రమంగా అమలు చేయాలి: ఎస్పీ అఖిల్ మహాజన్


అదిలాబాద్ మే 13, మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలి.సమాజంలో పోలీసు వ్యవస్థ కీర్తి ప్రతిష్టలు పెంపొందించాలా విధులను నిర్వర్తించాలిపోలీస్ స్టేషన్ రికార్డులను, సిబ్బంది పనితీరు పరిశీలన. సిబ్బంది ప్రతి ఒక్కరు కష్టపడుతూనిజాయితీతో విధులను నిర్వర్తించాలి అని సూచన.నేరడిగొండ పోలీస్ స్టేషన్ ను పరిశీలించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా వ్యాప్తంగా విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం నేరడిగొండ పోలీస్ స్టేషన్ సందర్శించి సిబ్బంది చేస్తున్న విధులపై పోలీస్ స్టేషన్లో నమోదు అవుతున్న కేసుల వివరాలను, కేసుల పరిశోధనపై చేసిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి పోలీసు కు కేటాయించిన గ్రామాన్ని సందర్శిస్తూ సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకుని ఆసాంఘిక కార్యకలాపాలు గంజాయి, గుడుంబా, మట్కా, నిర్వహించకుండా చూడాలన్నారు. ఎలాంటి సమాచారమైనా నేరుగా సంబంధిత పోలీసు అధికారులకు అందించాలని తెలిపారు. సమాజంలో పోలీసు వ్యవస్థకు ఉన్నత స్థానాన్ని కల్పించే విధంగా విధులను నిర్వర్తిస్తూ ఆదిలాబాద్ జిల్లా పోలీసు కీర్తిని పెంపొందించాలన్నారు. పోలీస్ స్టేషన్లో ఉండే ప్రతి ఒక్క సిబ్బందికి సమానమైన విధులను కేటాయించేలా చూడాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ, ఫిర్యాదు వచ్చిన వెంటనే గ్రామానికి కేటాయించిన పోలీసు అధికారిని విచారణ నిమిత్తం కేటాయించి బాధితులకు సరైన సమయంలో న్యాయం చేకూర్చే విధంగా చూడాలన్నారు. పిటిషన్ మేనేజ్మెంట్ పై సిబ్బంది ప్రతి ఒక్కరికి పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బ్లూ కోర్ట్, డైల్ 100 విధులను ప్రతివారం పర్యవేక్షిస్తూ మండల పరిధిలో ఎలాంటి మైనర్ డ్రైవింగ్, ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. మండలంలో ముఖ్యంగా గంజాయి లేకుండా ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది సమాజ శ్రేయస్సుకై కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. రాత్రిపూట గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఫింగర్ ప్రింట్ పరికరాన్ని ఉపయోగించి అనుమానితుల్ని, నేరస్థులను వేలిముద్రలను సేకరించి పరిశీలించాలని తెలిపారు.

## భూ భారతి రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ మే 13, (న్యూస్ పల్స్)భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా పైలట్ మండలం సైదాపూర్ లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు.భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సులలో భాగంగా సైదాపూర్ మండలం దుద్దెనపల్లి గ్రామపంచాయతీ భవనంలో, బొమ్మకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు కలెక్టర్ హాజరయ్యారు. రైతులు, ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే అన్ని మండలాల్లో నూతన చట్టం గురించి అవగాహన కల్పించామని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సైదాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాతిపదికన ఎంపిక చేసి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డులలో పేరు తప్పులు,విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. భూభారతి కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువులోపు భూ సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. వివిధ కారణాల వల్ల రెవెన్యూ సదస్సులో అర్జీలు సమర్పించే అవకాశం లభించని వారు తరువాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ కోరారు. భూ సమస్యలను పరిష్కరించుకుని, భూ వివాదాలు లేని గ్రామాలుగా పల్లెలను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సులను మండలంలోని అన్ని గ్రామాల రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సైదాపూర్ లోని రెవెన్యూ గ్రామాలలో ఈ నెల 20 వ తేదీ వరకు సదస్సులు పూర్తయ్యాక, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని మిగతా అన్ని మండలాలలో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ, సత్వర పరిష్కారానికి అనువుగా ఉన్న వాటిని వేరుగా నమోదు చేసి రెవెన్యూ సదస్సులో ముగిసేలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మీ సేవా, ఆన్లైన్లో నమోదు చేయాల్సిన అవసరం ఉంటే రైతులకు సహకరించి నమోదు అయ్యేట్టుగా చూడాలని తెలిపారు. సదస్సులో హుజూరాబాద్ ఆర్డీవో రమేష్ బాబు, తహసిల్దార్లు కనకయ్య, శ్రీనివాస్, రెవిన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ అభివృద్ధి పనుల్లో మునుగోడును పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోండి : ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, మే 13 : విద్యుత్ సమస్యల పరిష్కారంలో మునుగోడు నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎన్‌సీపీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌ను కోరారు. మంగళవారం మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా నెలకొన్న విద్యుత్ సమస్యలను ముఖ్య నాయకులతో కలిసి హైదరాబాద్‌లోని టీజీ ఎస్పీడీసీఎల్ రాష్ట్ర కార్యాలయంలో సీఎండీ ముషారఫ్‌ను కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న లో ఓల్టేజి సమస్య, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల కేటాయింపు, అదనపు సబ్ స్టేషన్ల నిర్మాణం, లూజు లైన్ల సమస్యలు, గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల పైన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగల తొలగింపు సమస్యలను సీఎండీ ముషారఫ్ అలాగే యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాలకు సంబంధించిన అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను సావధానంగా విన్న సీఎండీ ముషారఫ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అక్కడే ఉన్న యాదాద్రి, నల్లగొండ జిల్లాల విద్యుత్ అధికారులను ఆదేశించారు.నాణ్యమైన, భద్రతతో కూడిన కరెంట్ ఇచ్చే విధంగా రాబోయే కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ శాఖలో సమూలమైన సంస్కరణలు తీసుకొస్తుందని, ఆ సంస్కరణలు మొదట మునుగోడు నియోజకవర్గం నుండే మొదలుపెట్టాలని, మునుగోడు నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని విద్యుత్ అభివృద్ధి పనులు చేయాలని సీఎండీని ఎమ్మెల్యే కోరారు. మునుగోడు నియోజకవర్గ



వ్యాప్తంగా నెలకొన్న కరెంట్ సమస్యలు పరిష్కరించడానికి రూ.34 కోట్లు అవసరమవుతున్నా యని, ప్రత్యేక దృష్టితో ఈ నిధులు మంజూరు చేయాలని సీఎండీకి వినతి పత్రం అందజేశారు. విద్యుత్ శాఖలో పనిచేసే అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజలను వేధించి డబ్బులు వసూలు చేస్తున్న విషయాలు తన దృష్టికి వచ్చాయని, దీనివల్ల ప్రజా ప్రతినిధులుగా తమకు, ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. దయచేసి ఎవరైతే అవినీతి పాల్పడుతున్నారో వారిపైన కఠిన చర్యలు తీసుకుని స్ట్రీమ్ లైన్ చేయాలని సీఎండీని కోరారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. మునుగోడు పైన ప్రత్యేక దృష్టి ఉంటుందన్నారు. వ్యవసాయ పొలాల మధ్యన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్పిస్తామని, వాటి మే నుండి జూన్ మధ్యలో ఏబీ స్విచ్‌లు మొత్తం రిపేర్ చేయాలని అక్కడే ఉన్న అధికారులను సీఎండీ ఆదేశించారు.

# అర్థం కాని పవన్ స్ట్రాటజీ



విజయవాడ, మే 13 జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మౌనంగానే ఉంటూ తాను అనుకున్నది సాధిస్తున్నట్లు కనపడుతుంది. పవన్ కల్యాణ్ ఎన్నికల ముందు వరకూ కాస్త అగ్రెసివ్ గా కనపడేవారు. 2014 లో జనసేన పార్టీని పెట్టిన నాటి నుంచి ఆయన బహిరంగ సభల్లోనూ, రోడ్ షోల్లోనూ అన్ని పార్టీలపై విరుచుకుపడే వారు. తనకు ఒకసారి అధికారం ఇవ్వాలని పదే పదే కోరారు. 2019 ఎన్నికల్లో దారుణంగా ఓడించడంతో ఆయన ఆలోచన మారింది. 2014 తరహాలో కూటమిని ఏర్పాటు చేసి జగన్ ప్రభుత్వాన్ని అయితే గద్దెదించగలిగారు. పవన్ కల్యాణ్ అనుకున్నది సాధించారని, పట్టుదలతో ఆయన రాజకీయంగా తీసుకున్న వ్యూహాలు ఫలించాయన్న ప్రశంసలు అందుకున్నారు.2024 లో సూపర్ కాంబినేషన్ తో కూటమి హిట్ అయింది. 164 స్థానాల్లో విజయం సాధించింది. జనసేన పార్టీ అయితే వందకు వంద శాతం స్ట్రయిక్ రేట్ ను సాధించింది. పోటీ చేసిన అన్ని శాసనసభ స్థానాల్లోనూ, పార్లమెంటు స్థానాల్లోనూ గెలుపొందింది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పవన్ హర్ట్ కాకుండా అన్నిజాగ్రత్తలు తీసుకుంటున్నారు. పవన్ కల్యాణ్ మైండ్ సెట్ తెలిసిన చంద్రబాబు అందుకు అనుగుణంగా ట్యూన్ అయ్యారు. పవన్ ఏదీ తనకు కావాలని అడగరు. కానీ పవన్ ఆలోచనలను గుర్తించి చంద్రబాబు వాటిని అమలు చేస్తుండటంతో పవన్ కల్యాణ్ కూడా ఖుషీ ఫీలవుతున్నారు. ప్రధానంగా ఆయన తనకు కావాల్సిన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖను పట్టుబట్టి తీసుకున్నారు.ఆ శాఖకు సంబంధించి పవన్ నుంచి ఏదైనా నోట్ వచ్చిన వెంటనే దానికి సంబంధించిన నిధులు ఆగడానికి వీలులేదని చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు అధికారులకు జారీ చేశారు. పవన్ నుంచి వచ్చిన ఫైలు చూడాల్సిన పనిలేదని, నేరుగా తనకు ఆమోదం పంపాలని కూడా చంద్రబాబు ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులకు చెప్పినట్లు టాక్. అందుకే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి సంబంధించి పవన్ తీసుకున్న నిర్ణయాలతో పాటు ఆయన కోరిన నిధులను కూడా వెంటనే సమకూర్చుతున్నారు. మరొక వైపు మంత్రి నారా లోకేశ్ కూడా పవన్ ను తన సోదరుడిగా సంభోదిస్తూ ఆయనకు మంచి గౌరవమిస్తూ కూటమి ట్రాక్ తప్పకుండా వ్యవహరిస్తున్నారు.ఇక ప్రభుత్వం భర్తీ చేసే నామినేటెడ్ పోస్టుల విషయంలోనూ జనసేనకు ప్రాధాన్యత చంద్రబాబు ఇస్తున్నారు. పవన్ కల్యాణ్ స్వయంగా కలవకపోయినా నామినేటెడ్ పదవులు ఎవరికి ఇవ్వాలన్న దానిపై ఆయన నుంచి అనుమతి తీసుకున్న తర్వాతనే జనసేనకు నామినేటెడ్ పదవులు కేటాయిస్తూ వస్తున్నారు. ఇటు జనసేన కూడా క్షేత్రస్థాయిలో బలోపేతం కావాలంటే ఆ పార్టీ నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్నది పవన్ అభిప్రాయం. ఈ మేరకు భర్తీ అయ్యే పోస్టుల్లో అగ్రభాగం టీడీపీ తీసుకున్నప్పటికీ జనసేనకు కూడా తగినన్ని ఇస్తూ పవన్ కల్యాణ్ మాటకు ప్రభుత్వంలో తిరుగులేదన్న సంకేతాలను చంద్రబాబు సయితం బలంగా పంపుతున్నారు. మొత్తం మీద మౌనంగా ఉండి పవన్ తనకు కావాల్సిన రీతిలో అన్నీ సాధించుకుంటున్నారని, ఇదొక రకం వ్యూహమని రాజకీయ విశ్లేషకులు అంటున్నా రు

# పార్టీ ప్లీనరీకి బ్రేక్

కడప, మే 13, వైసీపీ అధినేత వైఎస్ జగన్ నిర్లిప్తత పార్టీ శ్రేణుల్లో నిరాశ నింపుతుంది. కేవలం తాడేపల్లి కార్యాలయంలో సమావేశాలు పెడితే కుదరదు. పార్టీ ప్లీనరీ జరపాలన్న స్పృహ కూడా జగన్ కు లోపించింది. పార్టీ ప్లీనరీ ఎవరైనా నిర్వహిస్తారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్లీనరీ ఏర్పాటు చేసుకుని పార్టీ బలోపేతం పై చర్చించుకుంటారు. అంతేకాదు పార్టీకి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. ప్లీనరీ ఒకటి రెండురోజులు జరిపితే ఈ కిక్కు వేరుగా ఉంటుంది. పార్టీ క్యాడర్ లో ఉత్సాహం మాత్రమే కాదు.. హాజరయిన కార్యకర్తలను చూసి ప్రత్యర్థులు సయితం ఆశ్చర్యపోతారు. అలాంటిది జగన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని జరిపేందుకు కూడా చేతులు రావడం లేదు. ఆయన ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారన్నది ఎవరికీ అర్థం కాకుండా ఉంది.వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి జులై ఎనిమిదో తేదీన ప్లీనరీని ఏర్పాటు చేస్తారు. అయితే పార్టీ ఆవిర్భావం జరిగిన తర్వాత ప్లీనరీలు అతి కొద్దిసార్లు మాత్రమే నిర్వహించారు. అదీ అధికారంలోకి రాకముందు ఒకటి రెండు సార్లు మాత్రమే నిర్వహించారు. అంతే తప్ప పెద్దగా ప్లీనరీలను నిర్వహించిన దాఖలాలు లేవు. ఎందుకో తొలి నుంచి జగన్ ప్లీనరీ నిర్వహణ పట్ల అంతగా మొగ్గు చూపడం లేదు. ప్రత్యర్థిగా భావిస్తున్న తెలుగుదేశం పార్టీని తీసుకుంటే అధికారంలో ఉన్నా, లేకపోయినా మహానాడును ఖచ్చితంగా జరుపుతారు. అధికారంలో ఉన్నదానికంటే రెట్టింపు ఉత్సాహంతో అధికారంలో లేనప్పుడు టీడీపీ బాగా జరుపుకుంటుంది. గత ఎన్నికలకు ముందు ఒంగోలులో నిర్వహించిన మహానాడు పార్టీకి మంచి హైప్ తెచ్చిపెట్టింది.ఈ సంగతి జగన్ కు తెలియంది కాదు. కానీ ప్లీనరీ ఏర్పాటుకు మాత్రం జగన్ ముందుకు రావడం లేదు. ప్లీనరీ అంటే జగన్ కాదు.. కార్యకర్తలకు పండగ. ఎందుకంటే తమకు ఇష్టమైన పార్టీ ప్లీనరీకి దూర ప్రాంతాల నుంచి తరలి వచ్చి జెండా పట్టుకుని మరీ నినదిస్తారు. కార్యకర్తలకు పార్టీ నాయకత్వం చేసేదేమీ ఉండదు. మంచి భోజనాలు పెట్టడం తప్పించి. అంతకు మించి కార్యకర్తలు కూడా ఏదీ కోరుకోరు. తమ ప్రత్యర్థి పార్టీలు పండగలా ప్లీనరీలు జరపుకుంటుంటే ఫ్యాన్ పార్టీ కార్యకర్తలు మాత్రం నిరాశగా ప్లీనరీ ఎప్పుడు పెడతారో? నన్న ఆశతో ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జగన్ కొన్ని నిర్ణయాలు ఇలా ఎందుకు తీసుకుంటారన్నది ఎవరికీ కానీ మొన్న జగన్ పార్టీ ప్లీనరీపై స్పష్టత ఇచ్చారు. ఈ ఏడాది ప్లీనరీ లేదని, వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫొటోలుకు దండలు వేసి మమ అనిపించేయడమేనని పరోక్షంగా చెప్పేశారు. వచ్చే ఏడాది బ్రహ్మాండంగా జరుపుకుందామని చెప్పారు. అయిదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కూడా ఒకే సారి ప్లీనరీ జరిపారు. ఇలా జగన్ తన నిర్ణయాలతో పార్టీని తానే నిర్వీర్యం చేసుకుంటున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అప్పుడు కూడా తాను పార్టీ శాశ్వత అధ్యక్షుడిగా ప్రకటించుకోవడానికే. ప్రతి ఏడాది ప్లీనరీ జరుపుతూ ఒక్కో ఏడాది ఒక్కో జిల్లాలో పెడుతుంటే అక్కడ వారికి మాత్రమే కాకుండా పార్టీ క్యాడర్ కు, నేతలకు కూడా ఉత్సాహం కలుగుతుంది.

# ఆ నలుగురు ఎవరు...

నెల్లూరు, మే 13, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి వర్గ విస్తరణకు సిద్ధమయ్యారు. వచ్చే నెలలో మంత్రి వర్గ విస్తరణ ఉండే అవకాశాలున్నాయి. ఇప్పుడు ఇది ఆంధ్రప్రదేశ్ లోని తెలుగుదేశం పార్టీలో హాట్ టాపిక్ గా మారింది. చంద్రబాబు నాయుడు గతంలో ఎన్నడూ లేని విధంగా సీనియర్ నేతలను పక్కన పెట్టి మరీ మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు... ఎవరికీ సీనియర్ నేతలన్న వారికి మంత్రి పదవులు దక్కలేదు. ఎన్నోఏళ్లుగా తాము పార్టీని నమ్ముకుని ఉంటే తమకు విషయంలో ఇలా జరిగిందేమిటి? అనేక మంది సీనియర్ నేతలు నొచ్చుకున్నారు. బయటపడకపోయినా మనసులో మాత్రం అసంతృప్తిగానే ఉంటున్నారు. దీంతో విస్తరణలో అయినా తమకు స్థానం దక్కుతుందేమోనని భావిస్తున్నారు.చంద్రబాబు ఒకరకంగా యువకులను మంత్రులుగా చేసి పాలనను పరుగు పెట్టించాలని భావించారు. కొందరయితే భవిష్యత్ లో లోకేష్ నాయకత్వం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారన్న టాక్ కూడా బలంగా వినిపించింది టాలెంట్ కన్నా, సీనియారిటీ కన్నా కొత్త వాళ్లకు అవకాశమివ్వడంలో మర్మం తెలియక అనేక మంది పార్టీ కార్యకర్తలు కూడా ఒకరకంగా ఇలా ఎందుకు జరిగిందబ్బా? అని తమలో తాము ప్రశ్నించుకున్నారు. కానీ ఎవరికి సరైన సమాధానం మాత్రం దొరకలేదు. నిర్దాక్షిణ్యంగా చంద్రబాబు సీనియర్లను పక్కన పెట్టడం గతంలో ఎన్నడూ జరగకపోవడంతో దీనికి కారణాలేమిటన్న దానిపై లోతుగానే తెలుసుకునేందుకు ప్రయత్నించారు. కానీ ఏడాదిలోనే వారిలో కొందరికి సీన్ లేదని అర్థమయింది.తమ శాఖలపై పట్టు సంపాదించుకోవడం మాట అటుంచి కనీసం వారికి అప్పగించిన బాధ్యతలను కూడా సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నారని చంద్రబాబు కొంత ఆందోళన చెందుతున్నారని తెలిసింది. జిల్లాల్లోనూ, నియోజకవర్గాల్లో నేతల మధ్య, కూటమి నేతల మధ్య సయోధ్యకు కూడా వీరు ప్రయత్నించడం లేదని, కొందరు అసలు జిల్లాల పర్యటన చేపట్టకపోవడంపై కూడా చంద్రబాబు ఆగ్రహంతో ఉన్నారు. దీంతో పాటు వైసీపీ నుంచి వస్తున్న విమర్శలకు సరైన సమాధానం కూడా మంత్రులు చెప్పలేకపోతున్నారన్న భావన చంద్రబాబులో బలంగా నాటుకుపోయింది. దీంతో మంత్రి వర్గ విస్తరణంలో ముగ్గురు నుంచి నలుగురిని తప్పించే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతుంది.వచ్చే నెలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి వర్గ విస్తరణ చేపట్టాలని చంద్రబాబు భావిస్తున్నట్లు పార్టీలో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. జనసేన ఎమ్మెల్సీ నాగబాబును మంత్రివర్గంలో తీసుకునే కార్యక్రమం ఒకటుంది. ఈ కార్యక్రమంలోనే ముగ్గురి నుంచి నలుగురు మంత్రులను తప్పించి వారి స్థానంలో సీనియర్ నేతలను మంత్రులుగా చేయాలని భావిస్తున్నారు. ఈ మంత్రి వర్గ విస్తరణలో తమకు అవకాశం గ్యారంటీ అని సీనియర్ నేతలు గట్టిగా నమ్ముతున్నారట.ఇక మరో రెండేళ్ల తర్వాత మళ్లీ విస్తరణ చేపట్టి ఎన్నికల టీం ను కూడా చంద్రబాబు సిద్ధం చేసుకుంటారని, అందుకోసం యువనేతల పదవులకు ఎసరు వచ్చినట్లేనన్న ప్రచారం పార్టీలో ఊపందుకుంది. అందుకే జూన్ నెల వస్తుందంటే మంత్రుల గుండెల్లో దడ మొదలయిందట.

# రివర్స్ గేర్ లో వై నాట్ కుప్పం




తిరుపతి, మే 13, వై నాట్ కుప్పం అంటూ హడావిడి చేశారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. కుప్పంలో చంద్రబాబును ఓడిస్తామని శపథం చేశారు. అంతటితో ఆగకుండా కుప్పంలో చంద్రబాబు పర్యటిస్తున్న సమయంలో అడ్డుకున్నారు కూడా. ఒకానొక దశలో దాడి చేసిన ప్రయత్నం చేశారు. అటువంటి కుప్పంలో ప్రస్తుతం సీన్ రివర్స్ అయ్యింది. కనీసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉనికి చాటుకునేందుకు కూడా పడరాని పాట్లు పడుతోంది. కుప్పంలో స్థానిక సంస్థలతోపాటు మున్సిపాలిటీని గెలిచేసరికి చంద్రబాబును సైతం ఓడిస్తామంటూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కయ్యానికి కాలు దువ్వాయి. అక్కడ వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ భరత్ ను ఎమ్మెల్సీగా చేసేసరికి ఆయన నేనే ఎమ్మెల్యేను అన్నంత రేంజ్ లో విరుచుకుపడ్డారు. వెనుకా ముందు చూసుకోలేదు. అయితే ఇప్పుడు అదే భరత్ పై తిరుగుబాటు చేస్తున్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. భరత్ ను నమ్ముకుంటే పార్టీ తుడుచుపెట్టుకుపోతుందని హెచ్చరించారు. హాయ్ కమాండ్ కు హెచ్చరికలు పంపారు.2019 ఎన్నికల్లో చంద్రబాబుపై పోటీ చేశారు భరత్. జగన్ ప్రభంజనంలో చంద్రబాబు మెజారిటీ తగ్గింది. దీంతో భరత్ ను కార్నర్ చేసుకుని రాజకీయం మొదలుపెట్టారు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. తన పుంగనూరు కంటే కుప్పం పై ఫుల్ ఫోకస్ పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటారు. మున్సిపల్ ఎన్నికల్లో సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించింది. ఇక కుప్పంలో చంద్రబాబును ఓడించడమే తరువాయి అన్నట్టు వైయస్సార్ కాంగ్రెస్ నేతలు వ్యవహరించారు. జగన్మోహన్ రెడ్డి సైతం చంద్రబాబు పై భరత్ గెలిస్తే మంత్రి పదవి ఇస్తానని ప్రకటించారు. అయితే వారు ఒకటి తలిస్తే కుప్పం నియోజకవర్గ ప్రజలు మరోలా తలిచారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇక్కడ తుడుచుపెట్టుకుపోయింది.ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఎమ్మెల్సీ భరత్ నియోజకవర్గంలో కనిపించకుండా మానేశారు. ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నారు.

ఈ తరుణంలో నియోజకవర్గంలోని శాంతిపురం జడ్పిటిసి సభ్యుడు శ్రీనివాసులు, సీనియర్ నేత ఏకంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి భరత్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. భరత్ తెలుగుదేశం పార్టీ చేతుల్లోకి వెళ్లిపోయారని విమర్శించారు. టిడిపికి అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. భజన వరులకి పదవులు ఇస్తున్నారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీకి మేలు చేసేలా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు వైయస్సార్ కాంగ్రెస్ సీనియర్ నేతలు. అయితే వెంటనే స్పందించిన భరత్ శాంతిపురం జడ్పిటిసి సభ్యుడు శ్రీనివాసులతో పాటు సీనియర్ నేతలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున చర్యలు తీసుకున్నామని చెప్పారు.ప్రస్తుతం కుప్పం నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విలవిలలాడుతోంది. కనీసం పార్టీ వాయిస్ వినిపించేవారు కూడా కరువు అవుతున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో కుప్పంలో ఏ స్థాయిలో విరుచుకుపడ్డారో తెలియనిది కాదు. అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవానికి వెళ్లిన చంద్రబాబుపై దాడి చేసినంత పనిచేశారు. ఓ మాజీ ముఖ్యమంత్రి కి దారుణంగా అవమానించారు. అయితే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాక వికలం అయింది. ఉనికి చాటుకునేందుకు కూడా ఇబ్బంది పడుతోంది.

# టీడీపీలో ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యే

కర్నూలు, మే 13, రాయలసీమలో అనూహ్య ఫలితాలు సాధించింది టిడిపి కూటమి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన ప్రాంతంగా ఉండే రాయలసీమలో ఆ పార్టీకి దారుణంగా దెబ్బతీసింది. కూటమి వేవ్ లో చాలామంది నేతలు ఎంపీలు, ఎమ్మెల్యేలుగా గెలిచారు. రాయలసీమలో ఈ స్థాయి విజయాన్ని చూసిన చంద్రబాబు ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలకు కీలక ఆదేశాలు ఇచ్చారు. చాలా రకాలుగా సూచనలు చేశారు. ఐకమత్యంతో ఉండి పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. ఎక్కడికక్కడే ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య విభేదాలు ఉన్నాయి. రోజురోజుకు అవి తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ముఖ్యంగా కర్నూలు జిల్లాలో నివురు గప్పిన నిప్పులా పరిస్థితి ఉంది. ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితికి వచ్చినట్లు టాక్ నడుస్తోంది. ఇలానే కొనసాగితే కష్టమని ప్రచారం జరుగుతోంది.కర్నూలు జిల్లాలో ఈసారి టిడిపి కూటమి సత్తా చాటింది. 2014, 2019 ఎన్నికల్లో ప్రభంజనం చాటిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎక్కడ తోక ముడిచింది. కొత్త కొత్త నేతలు ప్రజాప్రతినిధులుగా మారారు. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కుమార్తె శబరి అనూహ్యంగా కర్నూలు ఎంపీ అయ్యారు. అయితే ఆది నుంచి శబరి దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఆమెకు కొందరు ఎమ్మెల్యేలతో విభేదాలు తలెత్తాయి. కొన్ని సందర్భాల్లో బయటపడ్డాయి కూడా. ఆమె ఎమ్మెల్యేలను ఏమాత్రం లెక్క చేయడం లేదన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. దీంతో జిల్లాలోని చాలామంది ఎమ్మెల్యేలతో ఆమెకు పడడం లేదు. రాజాగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయ సూర్యకు, ఎంపీ శబరి కి మధ్య ఉన్న వివాదాలు రోడ్డు ఎక్కాయి. ఏకంగా అధికారిక కార్యక్రమంలో ఈ విభేదాలు వెలుగు చూడడంతో జిల్లా వ్యాప్తంగా చర్చ నడుస్తోంది.బైరెడ్డి కుటుంబ సొంత నియోజకవర్గం నందికొట్కూరు. ఆ నియోజకవర్గంలో పట్టు కోసం ఆ కుటుంబం పరితపిస్తుంది. అది రిజర్వుడు నియోజకవర్గం కావడంతో ఆ కుటుంబం పోటీ చేయడానికి వీలుపడడం లేదు. అయితే కర్నూలు నుంచి ఎంపీగా ఎన్నికైన శబరి నియోజకవర్గంలో పట్టు బిగించాలని చూస్తున్నారు. ఈ క్రమంలో కొత్తగా ఒక ఫైర్ స్టేషన్ నిర్మించాలని ప్రభుత్వం భావించింది. దీనికి శంకుస్థాపన జరపాలని అధికారులకు మంత్రి అనిత ఆదేశించారు. దీంతో అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ క్రమంలో ప్రోటోకాల్ ప్రకారం కర్నూలు ఎంపీ, నందికొట్కూరు ఎమ్మెల్యేలను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. తన నియోజకవర్గంలో జరుగుతున్న కార్యక్రమానికి ఎంపీ ని ఎందుకు పిలిచారు అంటూ ఎమ్మెల్యే జై సూర్య అధికారులను ప్రశ్నించారు. ముహూర్తానికి ముందే ఎంపీ రాకుండానే శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ నుంచి వెళ్లిపోయారు.ఎంపీ శబరి వచ్చేసరికి ఎమ్మెల్యే అక్కడ నుంచి వెళ్లిపోవడంతో ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు. ప్రోటోకాల్ ప్రకారం తాను వచ్చేదాకా ఎందుకు ఆగలేదని అధికారులను ప్రశ్నించారు. వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడితో ఆగకుండా ఎమ్మెల్యే చేసిన శంకుస్థాపనకు పక్కనే మరో శంకుస్థాపన చేశారు శబరి. అయితే ఎమ్మెల్యే జయ సూర్య వెనుక టిడిపి శ్రేణులు అధికంగా ఉన్నారు. ఎంపీ శబరి వెనుక మాత్రం పరిమిత సంఖ్యలో మాత్రమే కనిపించారు. మొత్తానికి అయితే కర్నూలు జిల్లాలో టిడిపిలో విభేదాలు స్పష్టంగా కనిపిస్తుండటం విశేషం. మరి హై కమాండ్ ఎలాంటి దిద్దుబాటు చర్యలకు దిగుతుందో చూడాలి.

# శ్రీవాణి దర్శన టికెట్లపై దుష్ప్రచారం సరికాదు: టీటీడీ

తిరుమలలో ఆఫ్లైన్ లో ఇస్తున్న శ్రీవాణి దర్శన టికెట్ల మిగిలిపోయాయంటూ సోషియల్ మీడియాలో కొందరు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని టీటీడీ పేర్కొంది. వాస్తవానికి ఆన్ లైన్లో 500 టికెట్లు, తిరుపతి ఎయిర్ పోర్ట్ లో 200 టికెట్లను అందుబాటులో ఉంచగా ఎప్పటికప్పుడు భక్తులు బుక్ చేసేసుకుంటున్నారు.ఏరోజు కూడా ఆన్ లైన్ లో శ్రీవాణి దర్శన టికెట్లు మిగిలిన సందర్భం లేదు. తిరుమలలో భక్తుల సౌకర్యార్థం ప్రతిరోజు 800 టికెట్లను భక్తులకు ఆఫ్ లైన్ లో జారీ చేస్తున్నారు. గత కొన్ని రోజుల్లో ఆఫ్ లైన్ లో పదుల సంఖ్యలో తగ్గాయేకాని,కొందరు వ్యక్తులు సోషియల్ మీడియాలో గతవారం రోజుల్లో వందల సంఖ్యలో టికెట్లు మిగిలిపోయినట్లు ప్రచారం చేయడం పూర్తిగా అవాస్తవం. అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీయడం తగదని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.




# కూటమిలో చిచ్చురేపుతున్న యార్లగడ్డ పదవి

మచిలీపట్నం, మే 13, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్.. ఈ పేరు తెలుగు రాజకీయాల్లో వినిపిస్తూనే ఉంటుంది. అలాగని ఈయన పూర్తిస్థాయి రాజకీయ నాయకుడు కాదు. అయితేనేం ఏ ప్రభుత్వం ఉన్నా.. ఏ పార్టీ అధికారంలో ఉన్న ఆయన స్థానం పదిలం. తాజాగా కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఓ పదిమంది సలహా సంఘం సభ్యులను నియమించింది. అందులో ఒకరు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్. ఆయనకు ఇప్పుడు ఎలా పదవి వచ్చింది అన్నది ప్రశ్న. తప్పకుండా కూటమి నేతల సహాయం ఆయనకు ఉంటుంది. ఆ సాయంతోనే ఆయన పదవి పొందారు. అయితే చంద్రబాబుతో పాటు టిడిపిని వ్యతిరేకించిన యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ కు పదవి ఎలా దక్కింది అన్నది ఇప్పుడు ప్రశ్న.వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో మంచి గుర్తింపు పొందారు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్. నామినేటెడ్ పోస్టులు ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి. అయితే గౌరవం కూడా దక్కించుకున్నారు. టిడిపి తో పాటు చంద్రబాబును విమర్శించడంలో పోటీపడేవారు. సహజంగానే ఇది జగన్ మోహన్ రెడ్డిని ఆకర్షిస్తుంది. అందుకే కీలకమైన నామినేటెడ్ పోస్టులు కేటాయిస్తూ వచ్చారు. అయితే జగన్ గ్రాఫ్ పడిపోయిందని తెలుసుకున్నారో ఏమో కానీ.. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పు సమయంలో నిరసిస్తూ నామినేటెడ్ పదవికి రాజీనామా చేశారు. అటు తరువాత కూడా జగన్ భజన చేయడం మానలేదు. చంద్రబాబు పై విమర్శలు కూడా మానలేదు. అటువంటి యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ కు కూటమిలో పదవి దక్కడం మాత్రం నిజంగా విశేషమే. అయితే అది పెద్ద పదవి కాకపోయినా.. గత అనుభవాల దృష్ట్యా యార్లగడ్డకు ఇవ్వడం మాత్రం నిజంగా సాహసమే.2014 నుంచి 2019 మధ్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ చేసిన హడావిడి అంతా కాదు. అప్పటివరకు గుర్తించిన ప్రభుత్వాలకు భిన్నంగా చంద్రబాబు సర్కారు వ్యవహరించింది. ఆ మాస్టారు ని దూరం పెట్టింది. దీనిని సహించుకోలేకపోయారు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్. చంద్రబాబు సర్కార్ ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టిందని రేచ్చిపోయారు. మాతృభాషను చంపేస్తారా అంటూ నిలదీశారు. జగన్మోహన్ రెడ్డి పంచన చేరి చంద్రబాబు సర్కార్ పై విషం చిమ్మే మేధావుల్లో చేరిపోయారు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్. అప్పటినుంచి చంద్రబాబు సర్కార్ పై విమర్శలు చేయడమే ఆయన పని. అందుకే 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష్మీప్రసాద్ కు రెండు పదవులు ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి.

అయినా సరే ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పు సమయంలో ఆ రెండు పదవులకు రాజీనామా చేశారు. సరిగ్గా ఎన్నికల ముందు సీన్ చూసి కూటమి తరపున ప్రచారం చేస్తానని చెప్పుకున్నారు. కానీ ఆయన సేవలను కూటమి వినియోగించుకోలేదు.కృష్ణాజిల్లా గుడివాడ నియోజకవర్గంలో జన్మించారు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్. మంచి విద్యాధికుడు కూడా. ఆంధ్ర యూనివర్సిటీ హిందీ విభాగంలో ఆచార్యుడిగా పని చేశారు. హిందీలో ఎంఏ పట్టా పొందారు. తెలుగు హిందీ భాషల్లో పిహెచ్డి పట్టాలు కూడా సాధించారు. నందిగామ కె.వి.ఆర్ కాలేజీలో అధ్యాపకుడిగా పని చేశారు. ఏయూలో ఆచార్యుడిగా 29 మంది విద్యార్థులకు పీహెచ్డీ మార్గదర్శకం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ హిందీ అకాడమీ చైర్మన్ గా, లోక్ నాయక్ ఫౌండేషన్ అధ్యక్షుడిగా, ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా చాలా రకాల పదవులు చేపట్టారు. పద్మ అవార్డులు కూడా దక్కించుకున్నారు. 1992లో అయితే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని కూడా అందుకున్నారు. అందుకే అన్ని ప్రభుత్వాలు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ కు ప్రాధాన్యమిస్తూ వచ్చాయి. అయితే ఇప్పుడు టిడిపిని వ్యతిరేకించిన లక్ష్మీప్రసాద్ కు పదవి రావడం మాత్రం విశేషమే.

## ముస్సిపల్ కమిషనర్ పులికనుమ ప్రాజెక్టు సందర్శన..



విభారే న్యూస్ మే 13 ఎమ్మిగనూరు..మునిసిపల్ కమిషనర్ ఎన్ గంగిరెడ్డి పులి కనుమ రిజర్వాయర్ ను సందర్శించి,నీటి నిలువ పరిశీలించి, గుడికల్ చెరువునకు 23 తేదీ లోపు అవసరమైన నీటిని తెచ్చుకొనుటకు సంబంధిత అధికారులతో చర్చించడం జరిగింది. అలాగే, బనవాసి ఫారం సందర్శించి అవసరమైన మొక్కలు ప్లాంటేషన్ డ్రైవ్ కొరకు ఏర్పాటు చేయడం జరిగింది. డి.ఈ.ఈ. నీరజ, ఏ.ఈ. శరత్ చంద్ర పాల్గొన్నారు.

## నేడు వృషభ సంక్రమణం సందర్భంగా సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు..

విభారే న్యూస్ మే 13 కర్నూలు జిల్లా ప్రతినిధి..శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో 14/05/2025 అనగా బుధవారం వైశాఖ మాసమున వృషభ సంక్రమణం రోజున ఉషా ఛాయ సమేత శ్రీ సూర్య నారాయణ స్వామి వారికి విశేషంగా సుగంధ ద్రవ్యములతో అరుణ పారాయణ సహిత రుద్ర మన్యుసూక్త అభిషేకము జరుగును ఇందులో భాగంగా మేషరాశి వారికి జాతక రీత్యా అద్భుతమైన ఫలితాలు, ఆయురారోగ్యాలు లభించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరు అభిషేకం జలం ఇవ్వబడును. అభిషేక సంకల్పం-116ప్రధానముగా అభిషేకం -1116 హోమ సంకల్పం -116 హోమం ప్రధానంగా -2500 సంప్రదించవలసిన నెం- సుబ్రహ్మణ్యం శర్మ -9494111519 దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నంబరు.. 8896123777ఆఫీసు ల్యాండ్ ఫోన్ నెంబర్..08518-234388..

## శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి విశేష అభిషేకం

శ్రీశైలం స్వాతి కిరణం: - లోకకల్యాణం కోసం దేవస్థానం ఆలయ ప్రాంగణం లోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది.ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి.కుమారస్వామి వారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి ఆకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు.తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి.సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు, పెరుగు, తేనె,నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి



# జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలి

**వార్తా కథనాలపై వెంటనే స్పందించాలి**
**ప్రతి రోజు ఆర్డీవో లు, ఎంపిడిఓ లు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజనీర్లు సమీక్ష చేసుకోవాలి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

విభారేన్యూస్కర్నూలు, ప్రతినిధి మే 13: జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లాలో తాగునీటి సరఫరా అంశంపై ఆర్డీవో లు, ఎంపిడిఓ లు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజనీర్లు,మున్సిపల్ కమిషనర్ లు, ఈ వో ఆర్డీ లు తదితరులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటికి సంబంధించి ఇది కీలకమైన సమయం అని, జూలై మాసం వరకు అధికారులు అప్రమత్తంగా ఉండి, జిల్లాలో ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుని, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పత్రికల్లో తాగునీటి సమస్యలకు సంబంధించి వచ్చే కథనాల పై వెంటనే స్పందించి, వాటిని పరిష్కరించి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.. ప్రతి రోజు ఆర్డీవో లు, ఎంపిడిఓ లు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజనీర్లు, ఈవో పీఆర్డీ లు సమీక్ష చేసుకోవాలన్నారు..రక్షిత మంచినీటి పథకాలు, ట్యాంకులు, ఫిల్టర్లు, పంపిణీ వ్యవస్థ సరిగా ఉందో లేదో చూసుకోవాలన్నారు.. పంచాయతీ,మండల పరిషత్ , జిల్లా పరిషత్ నిధులను వినియోగించుకునిఅవసరమైన వాటికి వెంటనే మరమ్మతులు చేయాలన్నారు..ఇంకా నిధులు అవసరం అయితే ప్రభుత్వానికి రాయాలని అధికారులకు సూచించారు..కోడ్ఆలూరు, ఆస్పరి, తుగ్గలి, మంత్రాలయం, గోనెగండ్ల, కౌతాళం, ఎమ్మిగనూరు, నందవరం, కోసిగి, హోళగుంద తదితర మండలాల్లో తాగునీటి ఇబ్బందులపై వచ్చిన కథనాల గురించి అధికారులతో ఆరా తీశారు. ఆయా మండలాల్లోని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులను పరిష్కరించారా అని ఎంపిడిఓ లు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లను ప్రశ్నించారు..ఆయా మండలాల్లో తీసుకున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు..సబ్ కలెక్టర్, ఆర్డీవోల తో మాట్లాడుతూ ఆయా డివిజన్ లలో నీటి సమస్యలపై ప్రతి రోజు సంబంధిత అధికారులతో సమీక్ష చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.. వార్తా కథనాలు, కంట్రోల్ రూమ్ ద్వారా వచ్చే ఫోన్ కాల్స్ పై వెంటనే స్పందించి అధికారులను అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఆదేశించారు..అవసరమైన చోట నీటిని ట్రాన్స్పోర్టేషన్ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు..పట్టణ ప్రాంతాలలో నీటి సమస్య గురించి కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లను అడిగి తెలుసుకున్నారు..వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు.. కర్నూలు లో ఎస్ ఎస్ ట్యాంక్, సుంకేసుల రిజర్వాయర్ లో పూర్తి సామర్థ్యంతో నీటి నిల్వ ఉండడం వల్ల తాగునీటికి ఇబ్బంది లేదని మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు వివరించారు.. అలాగే ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు లో కూడా నీటి సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆయా పట్టణాల మున్సిపల్ కమిషనర్ లు వివరించారు. గాజులదిన్నె రిజర్వాయర్, ఎల్ ఎల్ సి ల గురించి ఇరిగేషన్ ఎస్ ఈని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో తాగునీటి ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖల అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.టెలి కాన్ఫరెన్స్లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డిఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డిఓ భరత్ నాయక్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు,ఇరిగేషన్ ఎస్ ఈ బాలచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు అపద్దపు హామీలు ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయి

**లోకేష్ పాదయాత్ర హామీలకు పసలేకుండా పోయింది నిరుద్యోగులను మోసం చేసిన కూటమి సర్కార్:-మహేంద్ర నాయుడుయూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు**




కర్నూలు.:- రాష్ట్రంలోని నిరుద్యోగులను కూటమి సర్కార్ నిలువునా మోసం చేసిందని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేంద్ర నాయుడు కూటం ప్రభుత్వాన్ని విమర్శించారు. మంగళవారం కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మహేంద్ర నాయుడు మాట్లాడుతూ డియస్సి పేరుతో 24 వేలకు పైగ ఖాళీగా ఉంటే 16 వేలు పోస్టులు భర్తీ చేసి మిగతా పోస్టులకు మె?ండి చేయ్యి చూపింది అలగే యూనివర్సిటీల్లో, మెడికల్ కలలెజీల్లో, లైబ్రెరిలో, జూనియర్, డిగ్రీ కాలేజీల్లో సంవత్సరాలుగ ఖాళీగ ఉన్నాయి ఆ ఉద్యోగల భర్తీ పై ఎటువంటి ఆలోచన చేయ్యడం లేదన్నారు. 2014-19 లో కూడా తెలుగుదేశం ప్రభుత్వం నిరుద్యోగులకు భృతి ఇస్తామంటూ ఎంతో ఆర్భాటంగా ప్రకటించింది. వారి పార్టీలోని రాజకీయ నిరుద్యోగులకు మాత్రమే భృతి కల్పించి, నిరుద్యోగులను మోసం చేశారు. తిరిగి తాజా ఎన్నికల్లో కూటమి పార్టీలను గెలిపిస్తే లక్షల సంఖ్యలో ఉద్యోగాలు, నిరుద్యోగులకు భృతి చెల్లిస్తామంటూ ఆశలు కల్పించారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత ఎందుకు దీనిపై బడ్జెట్లో కనీస కేటాయింపులు కూడా చేయ లేదు? ప్రతిసారీ గత ప్రభుత్వం అప్పులు చేయ్యాడం వల్లనే ఎవరికి న్యాయం చేయలేక పోతున్నామంటూ చంద్రబాబు పదేపదే అబద్దాలు చెప్పి అందరి చెవుల్లో పూలు పెడుతు న్నారు.అధికారంలోకి రాకముందు పవన్ కల్యాణ్ ఎగిరేగిరి గంతులేసిన వ్యక్తీ నేడు నిరుద్యోగులకు న్యాయం చేయ్యటంలో మెసం చేశారు. అధికారమే లక్ష్యం జరిగిన లోకేష్ పాద యాత్ర పనికి రాని యాత్రగ చరిత్రలో మిగిలిపో తుంది.ఎన్నికల నాడు ఇచ్చిన హామీ లను అమలు చేయ్యకుండ చంద్ర బాబు మెసం వల్లే నేడు ప్రజలు, నిరుద్యోగులు ఆత్మహత్యలు జరుగు తున్నాయి.భవిష్యత్ లో యూత్ కాంగ్రెస్ అన్ని వర్గాలకు అండగ ఉంటు పోరాటం చేస్తూంది.ఈ కార్యక్రమంలో ఎస్సి సెల్ జిల్లా చైర్మెన్ ఎన్ సి బజారన్న , ఓబిసి జిల్లా చైర్మెన్ డివి సాంబ శివుడు, మైనారిటీ సెల్ జిల్లా చైర్మెన్ షేక్ ఖాజా హుస్సేన్, యూత్ కాంగ్రెస్ నాయకులు వెంకట్, ఆశోక్, రాజు, మహేష్, వంశి, నంద తదితరులు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ మరియు ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు చేపట్టిన ... కర్నూల్ మూడవ పట్టణ పోలీసులు



కర్నూలు స్వాతి కిరణం క్రైమ్:- కర్నూల్ జిల్లా ఇంచార్జి ఎస్పీ శ్రీ అది రాజ్ సింగ్ రాణా ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు కర్నూల్ మూడవ పట్టణ పోలీసులు సోమవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ , ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు నిర్వహించారు. డ్రంకెన్ డ్రైవ్ లో 4 గురు పట్టుబడ్డారు. వీరందరి పై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కర్నూలు జెఎఫ్ సి ఎం కోర్టు వారు ఒక్కొక్కరి పై రూ. 10 వేల జరిమానా విధించారు. బహిరంగప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజా శాంతికి భంగం కలిగించిన 4 గురి పై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశారు. కర్నూలు జె ఎఫ్ సి ఎం కోర్టు వారు ఒక్కొక్కరిపై రూ. 1000 జరిమానా విధించారు.

# టీడీపీలో ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యే

కర్నూలు, మే 13, రాయలసీమలో అనూహ్య ఫలితాలు సాధించింది టిడిపి కూటమి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన ప్రాంతంగా ఉండే రాయలసీమలో ఆ పార్టీకి దారుణంగా దెబ్బతీసింది. కూటమి వేవ్ లో చాలామంది నేతలు ఎంపీలు, ఎమ్మెల్యేలుగా గెలిచారు. రాయలసీమలో ఈ స్థాయి విజయాన్ని చూసిన చంద్రబాబు ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలకు కీలక ఆదేశాలు ఇచ్చారు. చాలా రకాలుగా సూచనలు చేశారు. ఐకమత్యంతో ఉండి పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. ఎక్కడికక్కడే ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య విభేదాలు ఉన్నాయి. రోజురోజుకు అవి తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ముఖ్యంగా కర్నూలు జిల్లాలో నివురు గప్పిన నిప్పులా పరిస్థితి ఉంది. ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితికి వచ్చినట్లు టాక్ నడుస్తోంది. ఇలానే కొనసాగితే కష్టమని ప్రచారం జరుగుతోంది.కర్నూలు జిల్లాలో ఈసారి టిడిపి కూటమి సత్తా చాటింది. 2014, 2019 ఎన్నికల్లో ప్రభంజనం చాటిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎక్కడ తోక ముడిచింది. కొత్త కొత్త నేతలు ప్రజాప్రతినిధులుగా మారారు. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కుమార్తె శబరి అనూహ్యంగా కర్నూలు ఎంపీ అయ్యారు. అయితే ఆది నుంచి శబరి దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఆమెకు కొందరు ఎమ్మెల్యేలతో విభేదాలు తలెత్తాయి. కొన్ని సందర్భాల్లో బయటపడ్డాయి కూడా. ఆమె ఎమ్మెల్యేలను ఏమాత్రం లెక్క చేయడం లేదన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. దీంతో జిల్లాలోని చాలామంది ఎమ్మెల్యేలతో ఆమెకు పడడం లేదు. రాజాగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయ సూర్యకు, ఎంపీ శబరి కి మధ్య ఉన్న వివాదాలు రోడ్డు ఎక్కాయి. ఏకంగా అధికారిక కార్యక్రమంలో ఈ విభేదాలు వెలుగు చూడడంతో జిల్లా వ్యాప్తంగా చర్చ నడుస్తోంది.బైరెడ్డి కుటుంబ సొంత నియోజకవర్గం నందికొట్కూరు. ఆ నియోజకవర్గంలో పట్టు కోసం ఆ కుటుంబం పరితపిస్తుంది. అది రిజర్వుడు నియోజకవర్గం కావడంతో ఆ కుటుంబం పోటీ చేయడానికి వీలుపడడం లేదు. అయితే కర్నూలు నుంచి ఎంపీగా ఎన్నికైన శబరి నియోజకవర్గంలో పట్టు బిగించాలని చూస్తున్నారు. ఈ క్రమంలో కొత్తగా ఒక ఫైర్ స్టేషన్ నిర్మించాలని ప్రభుత్వం భావించింది. దీనికి శంకుస్థాపన జరపాలని అధికారులకు మంత్రి అనిత ఆదేశించారు. దీంతో అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ క్రమంలో ప్రోటోకాల్ ప్రకారం కర్నూలు ఎంపీ, నందికొట్కూరు ఎమ్మెల్యేలను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. తన నియోజకవర్గంలో జరుగుతున్న కార్యక్రమానికి ఎంపీ ని ఎందుకు పిలిచారు అంటూ ఎమ్మెల్యే జై సూర్య అధికారులను ప్రశ్నించారు. ముహూర్తానికి ముందే ఎంపీ రాకుండానే శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ నుంచి వెళ్లిపోయారు.ఎంపీ శబరి వచ్చేసరికి ఎమ్మెల్యే అక్కడ నుంచి వెళ్లిపోవడంతో ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు. ప్రోటోకాల్ ప్రకారం తాను వచ్చేదాకా ఎందుకు ఆగలేదని అధికారులను ప్రశ్నించారు. వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడితో ఆగకుండా ఎమ్మెల్యే చేసిన శంకుస్థాపనకు పక్కనే మరో శంకుస్థాపన చేశారు శబరి. అయితే ఎమ్మెల్యే జయ సూర్య వెనుక టిడిపి శ్రేణులు అధికంగా ఉన్నారు. ఎంపీ శబరి వెనుక మాత్రం పరిమిత సంఖ్యలో మాత్రమే కనిపించారు.

# ఘనంగా జరుగుతున్న హోమాలు..

## గురు స్వామి పి. జె. విజయ్ కుమార్

ధర్మవరం మే13 పట్టణములోని శివానగర్లో ఈనెల 10వ తేదీ నుంచి 14 వ తేదీ వరకు శ్రీ అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట మహాకుంభాభిషేక మహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా దేవాలయ నిర్మాణ వ్యవస్థాపకులు గురు స్వామి పి. జె.విజయ్ కుమార్, కీర్తిశేషులు కలవల నాగరాజు కుటుంబ సభ్యులు, బండ్లపల్లి వెంకట జయప్రకాష్, అయ్యప్ప స్వామి భక్తాదుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నాలుగవ రోజు ఉదయము, సాయంత్రము కలనస్థాపనతోపాటు ఆవాహిత దేవత, పురుష సూక్త పునరచ్చరణ, ఉదకశాంతి అయ్యప్ప సహస్రనామార్చన, పూర్ణాహుతి, మంత్రపుష్పము, షాయదివాసము, వేద స్వస్తి తదితర హోమాలు వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమ అర్చకులు నిర్వహించారు. అత్యంత వైభవంగా జరుగుతున్న ఈ కార్యక్రమాలకు పట్టణ ప్రముఖులతో పాటు, ప్రజలు, అయ్యప్ప మాలధారణ భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు కూడా



నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ముఖ్యంగా పవమాన, మహా సుదర్శన హోమాలు నిర్వహించిన తీరు భక్తాదులను విశేషంగా ఆకట్టుకున్నాయి.తదుపరి కంచి పీఠాధిపతి విరుపాక్షి విద్యారణ్య భారతి స్వామీజీ ఈ కార్యక్రమాల కు ముఖ్యఅతిథిగా విచ్చేసి కలస స్థాపనలో పాల్గొని, దేవాలయ నిర్మాణ విషయంలో తగు మార్గదర్శకాలను, సందేశాలను ఇవ్వడం జరిగింది. అదేవిధంగా అయ్యప్ప మాల ధారణ భక్తాదులు, దేవాలయ నిర్మాణ వ్యవస్థాపకులు చేస్తున్నటువంటి ఈ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రారంభోత్సవ వేడుకలను కన్నులారా చూసి వారిని అభినందించి తమ ఆశీస్సులను అందజేశారు. హిందూ ధర్మం యొక్క గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ చాటాలని, హిందూ ధర్మాన్ని పాటించకపోవడం వల్ల ప్రజలు ఏ విధంగా నష్టపోతారు అన్న విషయాలను కూడా తెలియజేయాలని తెలిపారు. స్వామీజీ వివిధ హోమాలలో, ధ్వజ సంభాస్థాపనలో, విగ్రహ స్థాపనలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ వ్యవస్థాపకులు గురు స్వామి విజయకుమార్, కీర్తిశేషులు కలవల నాగరాజు కుటుంబ సభ్యులు, బండ్లపల్లి వెంకట జయప్రకాష్ తోపాటు అధిక సంఖ్యలో అయ్యప్ప మాలధారణ భక్తాదులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190